అక్రమంగా ఉద్యోగం పొందడమే కారణమని పేర్కొన్న బ్యాంకు ఉన్నతాధికారులు

తీసుకున్న జీతం, అలవెన్సులను 10శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఉత్తర్వులు

డీసీసీబీలో ముగ్గురు ఉద్యోగుల తొలగింపు

ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో అక్రమంగా పోస్టింగ్ పొందారని పేర్కొంటూ ముగ్గురు ఉద్యోగులను బ్యాంకు ఉన్నతాధికారులు సర్వీసు నుంచి ఈనెల 13వ తేదీన తొలగించారు. అక్రమంగా పోస్టింగ్ పొందిన రోజు నుంచి ఇప్పటివరకు అందిన జీతం, ఇతరత్రా అలవెన్సులన్నీ 10శాతం వడ్డీతోకలిపి నెలరోజుల్లోగా బ్యాంకుకు చెల్లించాలని గడువు విధించారు. ఈ తాకీదులు అందుకున్న వారిలో.. టి.లక్ష్మీప్రసన్న (మేనేజర్), డి.జయప్రకాష్ (స్టాఫ్ అసిస్టెంట్), బి.గురునాధం (స్టాఫ్ అసిస్టెంట్) ఉన్నారు. త్వరలోనే మరికొందరిపై వేటుపడే అవకాశం ఉంది.

ఉద్యోగాలు ఎలా పొందారంటే..

23 ఏళ్ల తర్వాత కారుణ్యం' పేరిట 2020 జూన్ 17వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారంటూ 23 ఏళ్ల తర్వాత ఓ ఉద్యోగి కుమారుడు జయప్రకాష్‌కు జీవో నెం.1005 కింద కారుణ్య నియామకం కింద ఉద్యోగం నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని దాని సారాంశం. డీసీసీబీ పుంగనూరు బ్రాంచ్‌లో డి.జయరామ్ అనే సూపర్‌వైజర్ 1997లో మృతిచెందారు. కారుణ్యనియామకాల కింద ఏడాది కాలపరిమితితో మృతుడి కుటుంబీకులకు అర్హతను బట్టి ఉద్యోగం ఇవ్వొచ్చు. అప్పట్లో జయప్రకాష్ అనర్హుడంటూ బ్యాంకు అధికారులు పోస్టింగ్ ఇవ్వలేదు. అనంతర కాలంలో పెద్దిరెడ్డి వర్గానికి జయప్రకాష్ దగ్గరయ్యాడు. పెద్దిరెడ్డి నోటిమాటతో నిబంధనలకు విరుద్ధంగా జయప్రకాష్‌కు 2020 మే 4వ తేదీన కుప్పం బ్యాంకు బ్రాంచ్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. దీనిపై బోర్డు మీటింగ్‌లోనూ తీర్మానం చేశారు. ఈ వ్యవహారంపై అప్పటి కలెక్టర్ షన్మోహన్‌కు కొందరు టీడీపీ నాయకులు విచారణ జరిపి.. నిగ్గుతేల్చాలని కోరారు. ఇటీవల జరిగిన సెక్షన్-51 విచారణలో ఈ అంశాన్ని గుర్తించిన విచారణ అధికారి, డీఆర్వో మోహన్‌కుమార్.. కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో ప్రస్తావించారు. అలాగే మరో ఇద్దరు ఉద్యోగులు టి.లక్ష్మీప్రసన్న (మేనేజర్), బి.గురునాధం (స్టాఫ్ అసిస్టెంట్)లు కూడా నిబంధనలకు విరుద్ధంగా విధుల్లో చేరారంటూ గుర్తించారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురిపై చర్యలు తీసుకున్నారు. వీరితోపాటు అప్పట్లో వైసీపీ కార్యక్రమాల్లో ఓపెన్‌గా పాల్గొంటూ నిబంధనలకు విరుద్ధంగా పార్టీ కార్యకర్తలకు రుణాలు ఇచ్చి.. పదవీ విరమణ చేసిన కె.కిరణ్ కుమార్ రెడ్డి (డీజీఎం), ఎస్.ఆషాబీ (ఏజీఎం), వై.యోగేశ్వర్ రెడ్డి (ఏజీఎం), సి.సుబ్రహ్మణ్యం (మేనేజర్)లకు నోటీసు వెళ్లింది. రికవరీ జరిగేంతవరకు వీరిపై చర్యలు కొనసాగనున్నాయి.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి



ఆంధ్రజ్యోతిలో 2020 జూన్ 17వ తేదీన ప్రచురితమైన కథనం

ప్రభుత్వానికి నివేదిక

డీసీసీబీలో జరిగిన అవకతవకలపై మొత్తం 48 మంది బ్యాంకు ఉద్యోగులను బాధ్యులుగా చేసి సస్పెన్షన్ వేటు వేశారు. 'డీసీసీబీలో ప్రక్షాళన' అనే శీర్షికతో ఈనెల 14వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ప్రాథమిక నివేదికలో బ్యాంకు ఉన్నతాధికారులు.. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌కు, ఆప్కాబ్‌కు పంపారు. ఇదే అంశాన్ని నాబార్డు, రిజర్వ్ బ్యాంకు దృష్టికి కూడా అధికారులు తీసుకెళ్లారు. రాష్ట్రంలోని 13 డీసీసీబీల్లో సెక్షన్-51 విచారణ జరుగుతోంది. ఒక్క చిత్తూరు డీసీసీబీలోనే కలెక్టర్ సుమిత్‌కుమార్ జోక్యంతో విచారణ పూర్తయి ప్రభుత్వానికి నివేదిక వెళ్లింది. చిత్తూరు డీసీసీబీ 104 ఏళ్ల చరిత్రలో ఒక్కసారిగా 48మంది ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి. బాధ్యులైన పాలకవర్గ సభ్యులపై, వైసీపీ ముఖ్యులపై త్వరలోనే తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను అధికారులు తీసుకుంటారన్నారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలని సూచించారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు హాజరై సమస్యలను విన్నవించుకోవాలని సూచించారు.

రేపటినుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధార్ నవీకరణకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం నుంచి ఈనెల 26వ తేదీవరకు మున్సిపాలిటీలు, మండలాల్లో ఎంపిక చేసిన 152 సచివాలయాల్లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ జిల్లా అధికారులకు ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా ప్రత్యేక అధికారి, రెవెన్యూ డివిజన్ అభివృద్ధి అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వందశాతం ప్రక్రియ పూర్తిచేయడానికి దసరా సెలవుల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

- **మరికొన్ని కేంద్రాలు పెరిగే అవకాశం**

ప్రక్రియ ప్రారంభమయ్యేనాటికి మరికొన్ని కేంద్రాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. చిత్తూరు జిల్లాలో 5-15 ఏళ్లలోపువారు 30,189 మంది, 15 ఏళ్లకు మించి వయసున్నవారు 16,438 మంది కలిపి 46,627 మంది ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ చేయాల్సి ఉంది. ఇప్పుడున్న ఆధార్ కార్డును తీసుకెళ్తే.. ప్రక్రియను పూర్తిచేస్తారు. సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇతర సిబ్బందికి ఈ బాధ్యతలు అప్పగించారు. శిబిరాల సమయంలో సదరు సిబ్బందికి ఇతర విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. కేంద్రాలను యాక్టివ్ చేస్తున్నామని, ప్రజలు సేవలను వినియోగించుకోవాలని, జిల్లా, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయకర్త రవికుమార్ తెలిపారు.

రామవనం నగరి వద్ద చిరుత సంచారం

- భయాందోళనలో స్థానికులు
- ఎవ్వరూ అడవిలోకి వెళ్లొద్దు: డీఆర్వో


పొలాల వద్ద చిరుత పాద ముద్రలు


చిరుత ఉన్న తోక బండ ప్రాంతం

ఐరాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐరాల తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని రామవనం నగరి వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో ఓ చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు చిరుత తన సంతానంతో గ్రామానికి సమీపంలోని పంట పొలాల వద్ద నుంచి చిత్తూరు-ఐరాల రోడ్డును దాటుకుని ఎదురుగా ఉన్న పెద్ద కొండలోని తోకబండ ప్రాంతంలోకి వెళ్లినట్లు గుర్తించారు. చితరు సంచారం తెలుసుకున్న స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఎవ్వరూ అడవిలోకి వెళ్లొద్దని అటవీశాఖ డీఆర్వో రాకేష్‌కుమార్ హెచ్చరించారు. ముఖ్యంగా పశువుల కాపరులు కొండప్రాంతం వైపు వెళ్లొద్దన్నారు. అలాగే రాత్రి సమయంలో చిత్తూరుకు పనులపై వెళ్లి ద్విచక్రవాహనంలో వచ్చేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత సంచారంపై సమాచారం ఉంటే వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. త్వరలోనే చిరుతను పట్టుకుంటామని తెలిపారు.

కరువు సీమలో ఖర్జూరం సాగు

- ఓ రైతు విజయం



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరువు సీమలో ఖర్జూరం సాగు చేసి విజయం సాధించారో రైతు. వినూత్న పంథాలో లాభాలు ఆర్జించారీయన. ఎస్ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరుకు చెందిన భాస్కర్ నాయుడు సాగు విషయంలో భిన్నంగా ఆలోచించారు. రొటీను పంటలు కాకుండా సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. 2016లో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన తనకున్న రెండు ఎకరాల పొలంలో ఖర్జూరం సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం గుజరాత్ వెళ్లారు. అక్కడి సాగు పరిస్థితులను తెలుసుకున్నారు. బరిహి అనే ఖర్జూరపు రకానికి చెందిన 150 మొక్కలు ఇక్కడకు తీసుకువచ్చారు. మొక్క రూ.3,500 వంతున కొనుగోలు చేశారు. ప్రస్తుతం మొక్క ధర రూ.5వేలు పలుకుతోంది. పొలంలో వీటిని నాటాక ఇందుకు అవసరమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించారు. నీటి సమస్య తలెత్తకుండా బోరు వేయించారు.

సుమారు రూ.8లక్షల వరకు ఖర్చు

ఇప్పటివరకు సుమారు ఎనిమిది లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు భాస్కర్ నాయుడు తెలిపారు. రెండేళ్ల నుంచి పంట దిగుబడి వస్తోందన్నారు. ఈ ఏడాది రూ.8లక్షలు వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. పంట ఉత్పత్తిలో ఎక్కువ భాగం బెంగళూరులో విక్రయిస్తున్నట్లు చెప్పారు. కొంత ఇక్కడే ప్రాసెస్ చేసి అమ్ముతున్నామన్నారు. ఈ పంటకు వేడి, పొడినేల అనుకూలమని.. అది కూడా తనకు కలిసొచ్చిందని వివరించారు.సాగు నీరు నిల్వ ఉండని, ఇసుకతో కూడిన లోతయిన నేల సాగుకు ఉపయుక్తంగా ఉంటుందని, సాధారణంగా మొక్కల వయసు పెరిగే కొద్దీ దిగుబడి బాగుంటుందన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడి అవసరమైన పంట కావడంతో ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపించడం లేదని చెప్పుకొచ్చారు.

లాభదాయకమైన పంట

మొదటి కోత కోసే సమయానికి మొక్క వయసు మూడు నుంచి ఐదేళ్లు ఉంటుందని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. ఈలోగా వ్యయం ఎక్కువైనా దిగుబడి రైతుకు తోడ్పాటునిస్తుందని, లాభదాయకమైన పంట అని తెలిపారు.


రైతు భాస్కర్ నాయుడు

నీకథ చూస్తానన్న మహిళా పోలీసు సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

పెనుమూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డిని నీకథ చూస్తానన్న మహిళా పోలీసు శకుంతలను కలెక్టర్ సుమిత్‌కుమార్ సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 'ఈనెల 11వ తేదీన సీఆర్ కండ్రిగ సచివాలయాన్ని విజిట్ చేసినప్పుడు ఆలస్యంగా రావడంపై శకుంతలను ప్రశ్నిస్తే.. 'నీ కథ చూస్తా.. నన్నే అడుగుతావా అంటూ నాపై ఎదురుతిరిగారు. పైగా నెల రోజులుగా విధులకు ఎందుకు ఆలస్యంగా వస్తున్నారని అడిగితే అసభ్యకరంగా ప్రవర్తించారు' అని కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో ఎంపీడీవో పేర్కొన్నారు. దాంతో ఆమెను సస్పెండ్ చేసి.. హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్లరాదని.. ఒకవేళ వెళ్లాలంటే ఎంపీడీవో అనుమతి తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టర్ సరెండర్, రేడియోగ్రాఫర్ బదిలీ

పెనుమూరు సీహెచ్‌సీని ఈనెల 18వ తేదీన కలెక్టర్ సుమిత్‌కుమార్ తనిఖీ చేసినప్పుడు కంటి, రేడియాలజీ విభాగాల్లో వైద్యులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించడం లేదని గుర్తించి, చర్యలకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో డీసీహెచ్ఎస్ పద్మాంజలి విచారించి.. కంటి డాక్టర్ ఎస్.గీతా కుమారిని కలెక్టర్‌కు సరెండర్ చేశారు. రేడియోగ్రాఫర్ పి.గీతను కుప్పం ఏరియా ఆస్పత్రికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈమె కుప్పం ఆస్పత్రి సూపరింటెండెంట్ వద్ద హాజరుకావాలని అందులో పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- ఎస్పీ తుషార్ డూడి


అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

కుప్పం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. కుప్పం డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. కుప్పం సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్షించారు. ముఖ్యమంత్రి నియోజవర్గమైన కుప్పం సబ్ డివిజన్లో శాంతిభద్రతల నిర్వహణ మరింత పటిష్ఠంగా ఉండాలన్నారు. అల్లర్లు, గొడవలకు తావుండరాదని చెప్పారు. సబ్ డివిజన్లో పోలీస్ మూవ్‌మెంట్స్ బాగా పెంచాలన్నారు. రోజూ విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, పట్టణంలో పోలీసుల రాకపోకలు ఉంటే అసాంఘిక చర్యలు అదుపులోకి వస్తాయన్నారు. రోడ్డు సేఫ్టీ ఉల్లంఘనలపై మరింత కఠినంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మట్కా, పేకాట వంటి జూద వ్యవహారాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలపై నిఘా పెంచి.. తద్వారా జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కఠినంగా అణచివేయాలని ఆదేశాలిచ్చారు. మహిళల భద్రత విషయంలో ఏమాత్రం అలసత్వం ఉండరాదన్నారు. చోరీలకు అడ్డుకట్ట వేస్తూనే, ఇదివరకే జరిగిన నేరాల్లో రికవరీలు పెంచాలని సూచనలిచ్చారు. డీఎస్పీ పార్థసారథి, కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య, ఎస్బీ సీఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

- డాక్యుమెంట్ రైటర్ల సమ్మే కారణం


చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా కార్డ్ ప్రైమ్ 2.0లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను నిరసిస్తూ శుక్ర, శని వారాల్లో డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కారణంగా రిజిస్ట్రేషన్లు తగ్గగా, ప్రభుత్వ ఖజానాకు ఆదాయమూ తగ్గుముఖం పట్టింది. జిల్లావ్యాప్తంగా ఉన్న ఎనిమిది సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో శుక్రవారం 94 రిజిస్ట్రేషన్లు జరిగి రూ.18.82 లక్షలు, శనివారం 140రిజిస్ట్రేషన్లు రూ.29.38 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. చిత్తూరు ఆర్వో, చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, పుంగనూరు ఎస్ఆర్‌లలో రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరిగాయి. కుప్పంలో శుక్రవారం ఒకటి, శనివారం 68 రిజిస్ట్రేషన్లు జరగ్గా, పలమనేరు, నగరిలో రెండేసి చొప్పున, కార్వేటినగరంలో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా అమలు చేస్తున్న పలు కొత్త విధానాలతో క్రయ, విక్రయదారులతోపాటు తాము కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నామని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు.

సుబ్బారెడ్డి చెరువుకు గండి
- అధికారుల చొరవతో పూడ్చివేత

బెట్టింగ్ యాప్ మోసగాడి అరెస్ట్

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ

7లో

మూడు మందలుగా విడిపోయి | పంటలపై గజదాడులు

- వరి, అరటి, కొబ్బరి, మామిడి పంటలకు అపార నష్టం
- జూపల్లె వద్ద అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన డీఎఫ్‌వో సుబ్బరాజు


పంటలపై ఏనుగుల దాడులను తెలుసుకుంటున్న సుబ్బరాజు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడం లేదు. నిన్నటి వరకు ఒకే మందగా ఉన్న 16 ఏనుగులు శుక్రవారం రాత్రి మూడు మందలుగా విడిపోయి పంటలను ధ్వంసం చేయడం మొదలుపెట్టాయి. శనివారం పగలంతా అటవీ ప్రాంతంలో తిష్ఠ వేసి, రాత్రి కాగానే పంటలపై పడ్డాయి. వరి, కొబ్బరి, మామిడి, అరటి పంటలకు అపార నష్టం వాటిల్లింది. శనివారం రాత్రి పులిచెర్ల మండలం సరిహద్దులోని తిరుపతి జిల్లా అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయల్దేరిన ఐదు ఏనుగుల మంద దిగుమూర్తివారిపల్లె మీదుగా దేవళంపేట వద్దకు చేరుకున్నాయి. సుధాకర్, ప్రభాకర్‌కు చెందిన వరి పంటను తొక్కేసి, చిన్ననగరి వద్దకు చేరుకుని రెడ్డెప్పకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడినుంచి మిట్టమదరాచపల్లె సమీపంలోని భాస్కర్, బాపూజీ, బసవయ్య, శ్రీకాంత్, శ్రీరాములు, సిద్దయ్యకు చెందిన వరిపంటను నాశనం చేశాయి. తర్వాత అడవిలోకి

- మిగతా 7వ పేజీలో



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీకి కానుకగా క్లీనింగ్ యంత్రాలు



టీటీడీకి ఆదివారం 18 క్లీనింగ్ యంత్రాలు కానుకగా అందాయి. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఐడీబీఐ బ్యాంకు రూ.19 లక్షల విలువైన 18 క్లీనింగ్ యంత్రాలను అందజేసింది. ఆదివారం ఉదయం ఆలయం ముందు ఈ యంత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్యాంకు ఎండీ, సీఈవో రాకేష్ శర్మ ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు. డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఐడీబీఐ రీజనల్ హెడ్ సాయికృష్ణ, బ్రాంచ్ హెడ్ మేనేజర్ రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి రైడ్ ఆన్ స్వీపర్ మిషన్ విరాళం

తిరుమల, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి ఆదివారం రూ.20 లక్షల విలువైన రాస్ స్ట్రీట్ ఆర్ఓ 1500 రైడ్ ఆన్ స్వీపర్ మిషన్ విరాళంగా అందింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మల్టీ పర్పస్ క్లీనింగ్ కోసం ఉపయోగించేందుకు ఈ మిషన్‌ను అందజేసింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి బ్యాంక్ జీఎం పత్రి శ్రీనివాస్ మిషన్‌ను అందజేశారు. అనంతరం అదనపు ఈవో ఈ మిషన్‌ను కొద్ది దూరం నడిపి పనితీరును పరిశీలించారు.



శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.4.59 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,042

తలనీలాలు సమర్పించినవారు: 23,393



డ్రగ్స్‌కు నో చెబుదాం జీవితాలను కాపాడుకుందాం

- యువతకు పిలుపునిచ్చిన ఎస్పీ సుబ్బరాయుడు
- ఘనంగా నమో యువరన్ 3కె ర్యాలీ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'డ్రగ్స్‌కు నో చెబుదాం. విలువైన జీవితాలను కాపాడుకుందాం. డ్రగ్స్ నిర్మూలనకు పోరాడుదాం. నవయుగ భారత్‌ను నిర్మిద్దాం' అంటూ ఎస్పీ సుబ్బరాయుడు యువతకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం 'నమో యువ రన్ 3కె ర్యాలీ' ఆదివారం తిరుపతిలో జరిగింది. మత్తు పదార్థాలు శరీరానికి హాని చేయడంతో పాటు జీవితాలనూ నాశనం చేస్తాయని ఎస్పీ వివరించారు. ఒక్కసారి అలవాటుపడితే సర్వం కోల్పోతారన్నారు. ఎవరికైనా డ్రగ్స్ వాడినా, అమ్మినా ఆ వివరాలను రాష్ట్ర టోల్ ఫ్రీ నెంబరు 1972కు, తిరుపతి జిల్లా నెంబరకు 1908కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. యుతను జాగృతం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి తెలిపారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి బాలాజీ కాలనీ, గాంధీరోడ్డు, తిలక్‌రోడ్డు మీదుగా తుడా ఇందిరా మైదానం వరకు కే రన్ సాగింది. వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, యువమోర్చా నాయకులు హరికృష్ణ, పృథ్వీ, కిషన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అలాగైతే అలిపిరిలో తల నరుక్కుంటా: భూమన



తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణికి సంబంధించి తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో ఘటన జరిగి ఉంటే అలిపిరి వద్ద తల నరుక్కుంటానని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి వ్యాఖ్యానించారు. అలా కాని పక్షంలో లోకేశ్, బీఆర్ నాయుడు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కొందరు సీసీ ఫుటేజ్ అంటూ హడావుడి చేస్తున్నారు. గత 20 ఏళ్లుగా పరకామణిలో రవికుమార్ చోరీ చేస్తున్నారని అంటున్నారు. అలా జరిగి ఉంటే గత చంద్రబాబు పాలనలో 15 సంవత్సరాలకు సంబంధించిన సీసీ ఫుటేజీని ఎందుకు బయట పెట్టడంలేదు. రవికుమార్‌ను మా ప్రభుత్వ హయాంలోనే పట్టుకున్నాం. ఈ ఘటనకు సంబంధించి ప్రాయశ్చిత్తంగా అతడి నుంచి రూ.14 కోట్ల మార్కెట్ విలువ చేసే ఆస్తులను టీటీడీకి అప్పగించడం జరిగింది. ఆ ఆస్తి విలువ రూ.100కోట్ల వరకు ఉంటుంది. సీబీసీఐడీ కాదు సీబీఐ చేత విచారణ జరిపించండి. ఏ విచారణనైనా ఎదుర్కొంటాం' అని పేర్కొన్నారు.

సెటిల్మెంట్ చేయడానికి మీరెవరు?

- భూమనకు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్న



తిరుపతి(ఎంఆర్‌పల్లె), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'శ్రీవారి పరకామణిలో రవికుమార్ దొంగిలిస్తే మిగిలిన గజదొంగలు పంచుకున్నారు. ఆ దొంగ సొత్తును సెటిల్‌మెంట్ చేయడానికి మీరెవరు? మీకేం అర్హత ఉంది' అంటూ భూమన కరుణాకరరెడ్డిని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పరకామణి చోరీ గురించి తనకు ఏం సంబంధంలేదని భూమన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రవికుమార్‌పై కేసు పెట్టినప్పటినుంచి భూమన టీటీడీ పాలకమండలిలో ఉన్నారన్నారు. పరకామణి దొంగతనంపై సాక్ష్యాధారాలతో బయటపెట్టినప్పటి నుంచి ఆయనలో భయం పట్టుకుందన్నారు. రవికుమార్‌నుంచి భూమన రూ.400కోట్లు తీసుకున్నారన్నారు. భూమన టీటీడీ చైర్మన్‌గా ఉన్నపుడు స్విమ్స్‌లో మందుల షాపుల కాంట్రాక్టరు నుంచి కూడా ముడుపులు తీసుకున్నారని, త్వరలోనే అన్ని వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

గొడుగుల ఊరేగింపులో కానుకలు ఇవ్వకండి

- భక్తులకు టీటీడీ సూచన

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవనాడు అలంకరించేందుకు చెన్నై నుంచి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులో భక్తులు ఎలాంటి కానుకలు ఇవ్వద్దని టీటీడీ కోరింది. భక్తులు అందించే ఈ కానుకలు టీటీడీకి చేరవని స్పష్టం చేసింది. బ్రహ్మోత్సవాల సమయంలో హిందూ సంస్థలు చెన్నై నుంచి గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకువచ్చి స్వామికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ గొడుగులు 27వ తేదీన తిరుమలకు చేరుకుంటాయని టీటీడీ పేర్కొంది.

ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జీనోజ్ అనే వ్యక్తి అదుపులోకి తీసుకుని, 1.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ రమణ తెలిపారు.ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రం కాలింగాల్ జిల్లాకు చెందిన ఆర్.జీనోజ్ ఈనెల 20వ తేదీన ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెంకటగిరి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు. వెంకటగిరి రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన జీనోజ్ కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద 1.5కిలోల గంజాయి లభ్యమైందని సీఐ తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.



శివప్రసాద్‌కు నివాళి అర్పిస్తున్న ప్రీతమ్

శివప్రసాద్‌కు ఘన నివాళి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎంపీ దివంగత డాక్టర్ నారమల్లి శివప్రసాద్ ఆరవ వర్థంతి సందర్భంగా ఆయన మనవడు, వీఎం గ్రూప్ అధినేత కేతన్ శివప్రీతమ్ నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులతో కలసి అగరాలలోని శివప్రసాద్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి

సృజనాత్మకతకు అద్దంపట్టిన కళాంగిని వేడుక

- ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల పాటు జరిగిన కళాంగిని వేడుక ఔత్సాహిక విద్యార్థులు, సీనియర్ ఆర్టిస్టుల సృజనాత్మకతకు అద్దం పట్టాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడులోని తిరుపతి ఐఐటీలో ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కళాంగిని వేడుక పేరిట శనివారం ఆర్ట్ వర్క్‌షాప్ నిర్వహించగా ఆదివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ జరిగింది. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీటెక్, ఎంటెక్ రీసెర్చ్ వంటి కోర్సులతో నిత్యం బిజీగా ఉండే ఐఐటీ విద్యార్థులు ఆర్ట్ క్లబ్ తరఫున ఇలాంటి కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. రోజువారి చదువుల ఒత్తిడి నుంచి ఈ తరహా కార్యక్రమాలు మానసిక ఉపశమనం కలిగిస్తాయన్నారు. ఇదొక ఆట విడుపు మాత్రమే కాకుండా విద్యార్థుల్లోని ప్రతిభను, సృతజనాత్మకతను వెలికి తీస్తుందన్నారు. దీనికి ఐఐటీతో పాటు ఐసర్ విద్యార్థులు పాల్గొనడం మంచి పరిణామమన్నారు. తిరుపతి నుంచి సీనియర్ మహిళ ఆర్టిస్టులు వర్క్‌షాప్‌లో పాల్గొని ఐఐటీ, ఐసర్ విద్యార్థులకు వివిధ రకాల పెయింటింగ్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఔత్సాహిక విద్యార్థుల కళారూపాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ తరహా కార్యక్రమాలను తరచూ నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.కృష్ణకుమార్, డీన్ ఎస్ఎస్ మూర్తి, పీఆర్వో చమన్ మెహతా, ఆర్టిస్టులు అర్చన, గాయత్రిదేవి, శ్రీదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి చెరువుకు గండి

అధికారుల చొరవతో పూడ్చివేత

పుంగనూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం బోడేవారిపల్లె వద్ద ఉన్న సుబ్బారెడ్డి చెరువుకు శనివారం రాత్రి గండి పడింది. అధికారుల చొరవతో ఆదివారం సాయంత్రం వరకు టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి పూడ్చివేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని నేతిగుట్ల పల్లె, బోడేవారిపల్లె పంచాయతీల్లో చెరువులు నిండి మొరవలు పోతున్నాయి. ఈ నేపథ్యంలో బోడేవారిపల్లె పంచాయతీలోని సుబ్బారెడ్డి చెరువులో ఉపాధి పథకంలో కట్ట, ఫారమ్ పాండ్ పనులు చేశారు. ఫారమ్ పాండ్ కోసం తీసిన మట్టిని చెరువు నిండి నీరువెళ్లే మొరవపై వేశారు. మట్టి అడ్డుగా ఉండటంతో మొరవ నుంచి నీరు వెళ్లలేక పక్కన గండి పడిన విషయాన్ని గమనించారు. చెరువు ఏ సమయంలో తెగి చెరువు పంటలు నాశనమవుతాయోనని రైతులు భయాందోళనలు వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని శనివారం రాత్రే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పుంగనూరు, మదనపల్లె తహసీల్దార్లు జె.రాము, కిశోర్‌రెడ్డి, మదనపల్లె ఇరిగేషన్ డీఈఈ బాబు రాజేంద్రప్రసాద్, జేఈ దీప, పుంగనూరు సీఐ సుబ్బరాయుడు తదితరులు హుటాహుటిన సుబ్బారెడ్డి చెరువు వద్దకు చేరుకుని పరిస్థితి గమనించారు. వెంటనే మొరవపై ఉన్న మట్టిని ఎక్స్‌కవేటర్‌తో పూర్తిగా తొలగించడంతో చెరువులోని వరదనీరు మొరవపై వెళ్లడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి తహసీల్దార్ రాము, వారి సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు చెరువు వద్దకు వెళ్లి టిప్పర్లతో మట్టిని తెచ్చి గండిని పూడ్చడంతో నీరు వెళ్లకుండా నిలవడంతో చెరువుకు ప్రమాదం తప్పింది.



ఇరిగేషన్ అధికారులతో కలిసి సుబ్బారెడ్డి చెరువు గండిని పూడ్చిస్తున్న తహసీల్దార్ రాము

మూడు మందలుగా విడిపోయి

పంటలపై గజదాడులు

(5వ పేజీ తరువాయి)

తిరుగుముఖం పట్టిన ఏనుగులు చింతలవంక వద్దకు చేరుకున్నాయి. మరో వైపు ఇదే అటవీ ప్రాంతం నుంచి బయల్దేరిన జంట ఏనుగులు పాళెం పంచాయతీలోకి చొరబడ్డాయి. సయ్యద్‌బాషా, రత్నాకర్‌నాయుడు, దామోదర్‌నాయుడు, సుబ్బరత్న, కళావతమ్మకు చెందిన వరి, మామిడి, పశుగ్రాసంను ధ్వంసం చేశాయి. తర్వాత అడవిలోని చింతలవంక వద్దకు చేరుకున్నాయి. ఇంకోవైపున పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయల్దేరిన తొమ్మిది ఏనుగుల మంద రిలయన్స్ టవర్ మీదుగా ఎద్దులవారిపల్లె వద్దకు చేరుకుని ఇక్బాల్‌కు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. తర్వాత మార్కొండయ్య, గురప్ప, ప్రసాద్, బాలకృష్ణ, నడిపన్న, బాలచంద్రకు చెందిన వరి, అరటి పంటలు, నీటి పైపులను ధ్వంసం చేసుకుంటూ తలారివారిపల్లె, పాతపేట, పూరేడువారిపల్లె, గౌరిశెట్టివారిపల్లె, ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె, చొక్కావారిపల్లె, చల్లావారిపల్లె మీదుగా తిరిగి గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నట్లు స్థానికులు తెలిపారు.

సమన్వయంతో దాడులను అరికట్టాలి : డీఎఫ్‌వో

'తూర్పు, పశ్చిమ విభాగం అటవీ ప్రాంతమనే తేడాలు చూపకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ పంటలపై ఏనుగుల దాడులను అరికట్టాలి. అలాగే ఏనుగుల నుంచి ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకోవాలి' అని చిత్తూరు డీఎఫ్‌వో సుబ్బరాజు తెలిపారు. ఈ సందర్భంగా పులిచెర్ల మండలంలోని పాళెం పంచాయతీ జూపల్లె సమీపంలోని అడవిలో ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాలను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలోకి ఏనుగులు ఎప్పుడు ప్రవేశించాయి, పంటలపై జరిగిన దాడులు, డ్రోన్ సాయంతో అడవిలో ఏనుగుల గుర్తింపు వివరాలను తూర్పు విభాగం ఎఫ్ఆర్‌వో థామస్ సుకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, మధు, ట్రాకర్లు పాల్గొన్నారు.

కపిలతీర్థం.. కిక్కిరిసిన భక్తజనం

- పిండ ప్రదానం చేయడానికి తరలి వచ్చిన జనం
- స్వల్ప తోపులాట, భారీ బందోబస్తు





కపిలతీర్థం వద్ద భక్తుల భద్రతను పర్యవేక్షిస్తున్న తిరుపతి ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య- ఆదివారం. ఇలా చాలా ఏళ్లకు ఒకసారి వచ్చే దినం. దీంతో తిరుపతిలోని కపిలతీర్థంలో తమ పూర్వీకులు, పెద్దలకు పిండ ప్రదానం చేయడానికి తరలివచ్చారు. ముందస్తుగా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. అయితే ఊహించని విధంగా వేలాది మంది ఒక్కసారిగా రావడంతో పోలీసులకు సైతం భక్తులను నియంత్రించడం కష్టంగా మారింది. దీంతో ఆలయం ప్రధాన ద్వారం వద్ద నంది సర్కిల్ నుంచి ఆలయంలోకి వెళ్లే రోడ్డుపై కొంత తోపులాట చోటు చేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్పీ సుబ్బరాయుడు అక్కడకు చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. ఏమాత్రం కాస్త అజాగ్రత్తగా ఉన్నా పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. కాగా, తోపులాటను కాస్త తొక్కిసలాటగా మీడియాలో ప్రచారం కావడంతో అప్రమత్తమైన పోలీసులు భారీ సంఖ్యలో ఎస్టీఎఫ్ పార్టీలను అక్కడకు మోహరించారు. బ్యారికేడ్లు ఏర్పాటు చేసి క్యూ పద్ధతిలో లోనికి అనుమతించడంతో రద్దీ తగ్గింది. కాగా, కపిలతీర్థం వద్ద 200 మందిపైగా పురోహితులు పిండ ప్రదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ

కపిలతీర్థం వద్ద ఎలాంటి తొక్కిసలాట జరగలేదని ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నియంత్రణకు అదనపు బందోబస్తు ఏర్పాటు చేశాం. వాహనాల పార్కింగ్ స్థలం పరిమితంగా ఉండటంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. ఆలయ పరిసరాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కొన్ని సోషల్ మీడియాల్లో తొక్కిసలాట జరిగినట్లు ప్రసారమైన వార్తలు పూర్తిగా అవాస్తవం. నిజమైన సమాచారం కోసం పోలీసు శాఖ అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలి' అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కాగా, ఓంకార్ అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలు, ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేశారని అలిపిరి సీఐ పేర్కొన్నారు. ఇలా భక్తుల్లో భయాందోళన సృష్టించిన ఆయనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు మహిళ



మహిళను తల్లిదండ్రులకు అప్పగించిన డీఎస్పీ అజీజ్

నగరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ మహిళను అక్కున చేర్చుకుని కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులు పెద్ద మనసు చాటుకున్నారు. వివరాలిలా.. ఈనెల 16వ తేదీన నగరిలో సుమారు 30 ఏళ్ల వయసున్న మహిళ మతిస్థిమితం లేక రోడ్డుపై తిరుగుతూ, అందరితో గొడవపడుతోందని పోలీసుల దృష్టికి వచ్చింది. సీఐ విక్రమ్ వెంటనే విషయాన్ని డీఎస్పీ అజీజ్‌కు తెలియజేశారు. ఆయన ఆదేశాలతో ఎస్ఐ విజయ నాయక్, మహిళా కానిస్టేబుల్ భార్గవిలు బాధిత మహిళ గురించి వివరాలు సేకరించారు. ఆమె మధ్యప్రదేశ్ పఠాన్ జిల్లా జబల్పూర్‌కు చెందిన పేరు ప్రస్తుధీ షేన్(31)గా గుర్తించారు. భర్త పేరు రమేష్‌గా తెలుసుకొన్నారు. వెంటనే రాష్ట్ర పోలీసు శాఖ ద్వారా ఆమె కుటుంబీకులకు సమాచారమిచ్చారు. ఈలోగా ఆమెకు చిత్తూరు వన్‌స్టాప్ సెంటర్‌లో ఐదురోజుల పాటు చికిత్స అందించారు. ఆదివారం మహిళను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ అల్లుడు అనారోగ్యం పాలయ్యాడని, ఈక్రమంలో తప్పిపోయిన తమ కుమార్తెను పోలీసులు క్షేమంగా అప్పగించారని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈవిషయంలో పోలీసుల చొరవను ఎస్పీ తుషార్ డూడి ప్రశంసించారు.

అన్ని వర్గాలకు జీఎస్టీ సంస్కరణలతో మేలు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు పారిశ్రామికవేత్తలకే కాకుండా సామాన్యులకు కూడా చాలా ఉపయుక్తమని బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు అన్నారు. ఆదివారం చిత్తూరు నగరంలోని కన్యకాపరమేశ్వరి సత్రంలో జీఎస్టీ సంస్కరణలపై బీజేపీ, చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా వ్యాపారస్తులు, మేధావులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తువుల వాడకం మారిందన్నారు. ఈక్రమంలోనే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో రెండు కేటగిరీలుగా మార్చి సంస్కరించిందన్నారు. ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేస్తుందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల వల్ల అనేక వస్తువుల పన్ను రేట్లు తగ్గనున్నాయన్నారు. వినియోగదారుల కొనుగోలుస్థాయి పెరుగుతుందన్నారు. జీఎస్టీ సంస్కరణలపై చిట్టిబాబు తయారు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ అధికారి ప్రసాద్, బీజేపీ నాయకులు రామభద్ర, రెడ్డి మస్తాన్, రాజేష్, సత్య చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీ సంస్కరణల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, వ్యాపారులు, అధికారులు



ఎఫ్ఎస్‌వో సుకుమార్‌ను పరామర్శిస్తున్న సుబ్బరాజు

సుకుమార్‌కు డీఎఫ్‌వో పరామర్శ

పలమనేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు వద్ద ఈనెల 13వ తేదీన ఒంటరి ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎఫ్ఎస్‌వో సుకుమార్‌ను డీఎఫ్‌వో సుబ్బరాజు ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

బార్లపై ఆసక్తి చూపని మద్యం వ్యాపారులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బార్ల ఏర్పాటుకు మద్యం వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. గతనెల 18వ తేదీన ప్రభుత్వం జిల్లాలో 12 కొత్త బార్ల ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 8, అందులో గీత కులాల వారికి 50 శాతం రాయితీతో ఒక బార్ కేటాయించారు. కుప్పం, నగరి, పుంగనూరు, పలమనేరు మునిసిపాలిటీలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 12 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఒక్కో బార్‌కు రూ.5.10 లక్షలు తిరిగిరాని దరఖాస్తు రుసుంగా ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో గతనెల 30వ తేదీన ఐదు బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. రెండోవిడత ఈనెల 18వ తేదీన మూడు బార్లకు దరఖాస్తులు వచ్చాయి వాటికి లాటరీ ద్వారా కేటాయింపులు జరిగాయి. ఇంకా చిత్తూరులో నాలుగు బార్లకు దరఖాస్తులు రాలేదు. త్వరలోనే ఈ బార్లకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించనుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

● పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుతో వెనుకడుగు

ప్రభుత్వం ఇటీవలే మద్యం దుకాణాల పక్కన పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అనుమతివ్వడంతో బార్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే వ్యాపారులు ఆలోచనలో పడ్డారు. గతంలో పర్మిట్ రూమ్‌లకు 150 చదరపు అడుగులు ఏర్పాటు చేసుకునేందుకు మాత్రమే అనుమతిచ్చింది. కానీ ఇప్పుడు వెయ్యి అడుగుల్లో పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకునేందుకు అనుతిచ్చింది. ఇది దాదాపు మినీ బార్‌ను తలపించేలా ఉంటుంది. పైగా మద్యం దుకాణాలకంటే బార్లలో మద్యం, తినుబండారాల ఖరీదు ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే కొందరు మద్యం దుకాణ వ్యాపారులు తమ వ్యాపారం సరిగా జరగడంలేదని ఆందోళనలో ఉన్నారు. మరోవైపు ఒక బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ నిర్వహిస్తారనే నిబంధన పెట్టడంతో దరఖాస్తు చేసుకునేందుకు వ్యాపారులు వెనకడుగు వేస్తున్నారు. పైగా తిరిగిరాని దరఖాస్తు రుసుం రూ.5.10 లక్షలు ఉండటంతో సందిగ్ధంలో పడ్డారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ

చౌడేపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ అమ్మవారి భక్తుల గంగమ్మ నామస్మరణతో ఆదివారం మార్మోగింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.





ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ, అమ్మవారి దర్శనం కోసం వేచియున్న భక్తులు

కన్నియాకుమారిలో పెద్దపంజాణి వాసి అదృశ్యం

పెద్దపంజాణి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంకు చెందిన కన్నియాకుమారిలో పెద్దపంజాణి మండలానికి చెందిన అయ్యప్ప భక్తుడొకరు అదృశ్యమయ్యాడు. పెద్దపంజాణి మండలం కరసనపల్లె పంచాయతీ మిట్టపల్లెకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు 37 మంది శబరిమల అయ్యప్ప దర్శనానికి ఈనెల 16వ తేదీన బస్సులో బయల్దేరారు. 19వతేదీన అయ్యప్పస్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో కన్నియాకుమారికి వెళ్లారు. అక్కడ 20వ తేదీ రాత్రి అమ్మవారి దర్శనం చేసుకుని అందరూ బస్సువద్దకు చేరుకోగా అంజప్ప మాత్రం రాలేదు. అందరూ కలిసి ఆ ప్రాంతమంతా గాలించారు. ఆచూకీ తెలియక పోవడంతో ఆదివారం ఉదయం కన్నియాకుమారిలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అంజప్ప

బెట్టింగ్ యాప్ మోసగాడి అరెస్ట్

పెద్దపంజాణి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్ మోసగాడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన చంద్రబాబు బెట్టింగ్ యాప్‌ల ద్వారా ప్రజలను మోసం చేసేవాడు. ఈ నేపథ్యంలో రాయలపేట గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి వద్ద షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడతానని నమ్మించి రూ.2 లక్షలు తీసుకుని మోసం చేయడమే కాకుండా అతడి బ్యాంకు అకౌంటుకు ఇతని మొబైల్ నెంబరును లింకు చేసుకుని దాదాపు రూ.కోటికిపైగా లావాదేవీలు చేసి మోసం చేశాడని లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు చంద్రబాబుపై కేసు నమోదు చేసి ఆదివారం రాయలపేట సమీపంలో అరెస్ట్‌చేసి రిమాండుకు పంపామని పలమనేరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరశురాముడు, పెద్దపంజాణి ఎస్ఐ ధనుంజయరెడ్డి తెలిపారు.



బెట్టింగ్ యాప్ మోసగాడిని అరెస్టు చేస్తున్న పోలీసులు

దెబ్బతిన్న బడవలవంక ప్రాజెక్టు తూము

- వృథాగా పోతున్న నీరు

రొంపిచెర్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలో బండకిందపల్లె సమీపంలో బడవలవంక ప్రాజెక్టులో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటి నిల్వలు చేరాయి. ఈక్రమంలో రైతుల భూములు, బోరు మోటార్లు, వరి, టమోటా వంటి పంటలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు ప్రాజెక్టు బండకిందపల్లె తూముకు అమర్చిన బండలు కూల్చడంతో ప్రాజెక్టులోని నీరు వృథాగా పోతోంది. ఆదివారం సమాచారం అందుకున్న నీటిపారుదలశాఖ అధికారులు, తహసీల్దార్ అమరనాథ్, ఎస్ఐ సుబ్బారెడ్డితోపాటు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా గాదిచెరువుపల్లె, రామిరెడ్డిగారిపల్లె, కొండారెడ్డిగారిపల్లె, పడమమటి హరిజనవాడ గ్రామాలకు చెందిన రైతులు చేరుకుని తమకు ముంపు పరిహారం అందలేదని, ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు చేరితే శ్రీనాథపురం, రామిరెడ్డిగారిపల్లె గ్రామాలు నీట మునుగుతాయని చల్లా రామచంద్రారెడ్డితో వాపోయారు. సమస్య కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. రాష్ట్రకురబ కార్పొరేషన్ డైరెక్టరు, మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి, సీవీ రెడ్డి, పోలీస్ గిరి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ రైతు అధ్యక్షుడు ఓబులేశ్వరరెడ్డి పాల్గొన్నారు.







బండవలవంక ప్రాజెక్టు- ముంపునకు గురైన పంట భూములు- ముంపు భూముల రైతులతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

కంటి ఆపరేషన్‌కు 54 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేయించుకుంటున్న వయోజనులు

కుప్పం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బెంగళూరు శారద కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి దాదాపు 200 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 54 మందిని ఉచిత కంటి ఆపపరేషన్లకు ఎంపిక చేసినట్లు సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఎంపిక చేసిన వారికి బెంగళూరులోని శారద కంటి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఉచిత వసతి, భోజన, ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది రాజేశ్, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదలు పస్తులుండరాదన్నదే చంద్రన్న ధ్యేయం



అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న విశ్వనాథ్

రామకుప్పం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదలు పస్తులుండరాదన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్ తెలిపారు. ఆదవారం ఆయన రామకుప్పం అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పెద్దలు తమ పాలనలో అన్నక్యాంటీన్లను మూసివేసి పేదల కడుపుకొట్టారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్నక్యాంటీన్లను పునరుద్ధరిస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కుప్పం నియోజకవర్గంలో మరో 4 అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేయనున్నారన్నారు. ఇప్పటికే కుప్పంలో సొంత భవనంలో అన్న క్యాంటీన్ కొనసాగుతోందని, మిగిలిన 4 క్యాంటీన్లకు రూ.24 కోట్లతో సొంత భవనాలను ప్రభుత్వం త్వరలోనే నిర్మిస్తుందని తెలిపారు.

లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం

● పాఠశాలకు రూ.25 వేలు విలువైన కంప్యూటర్ వితరణ



ఉచితంగా కంప్యూటర్‌ను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

కల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తున్నామని జిల్లా లయన్స్‌క్లబ్ అదనపు కార్యదర్శి రాజారెడ్డి, క్రీడావిభాగం అధ్యక్షులు మహమ్మదలి, రీజన్ చైర్‌పర్సన్ రామయ్య తెలిపారు. కల్లూరు లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఆదివారం పాకాల మండలం మెగరాల జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.25 వేలు విలువైన కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, ప్రతి విద్యార్థి కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి లయన్స్‌క్లబ్ ముందుంటుందని తెలిపారు. ఉచితంగా కంప్యూటర్ అందజేసిన లయన్స్‌క్లబ్‌ను పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు వెంకటశిద్దులు అభినందించారు. లయన్స్‌క్లబ్ అడ్వైజర్ పోకల తాతయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వెంకటశిద్దులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

● గాయపడిన జనసేన, వైసీపీ కార్యకర్తలు



గాయపడిన హరి



గాయపడిన అరవింద్

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య హిజ్రా ఆశీర్వాదం విషయంగా జరిగిన ఘర్షణలో జనసేన వైసీపీ కార్యకర్తలు ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన పుంగనూరులోని ఓ దాబా వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. వివరాలిలా.. పుంగనూరు బైపాస్ రోడ్డులోని జేన్యూటౌన్ సమీపంలోని బోయకొండ గంగమ్మ దాబాలో స్థానిక మేలుపట్లకు చెందిన వైసీపీ కార్యకర్త జి.అరవింద్, నవీన్, హరీశ్, గణేశ్, రాజు మద్యం సేవిస్తున్నారు. మరోవైపు జనసేన కార్యకర్తలు పెంచుపల్లెకు చెందిన పాముల హరి, స్థానిక తోపుమఠానికి చెందిన చిన్నా, సింగిరిగుంటకు చెందిన సుబ్రహ్మణ్యం మద్యం తాగుతున్నారు. ఈ నేపథ్యంలో దాబాలోకి ఓ హిజ్రా రాగా జనసేన కార్యకర్త హరి ఫోన్‌పే ద్వారా రూ.100 వేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇది గమనించిన అరవింద్ హిజ్రాను పిలవడం అక్కడ ఇరువర్గాలకు మాటామాటా పెరిగి గొడవకు దారి తీసి ఘర్షణపడ్డారు. దాడిలో అరవింద్, పాముల హరి, సుబ్రహ్మణ్యం గాయపడ్డారు. విషయం పోలీసులకు తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘర్షణ మద్యం మత్తులో హిజ్రా ఆశీర్వాదం వల్లే జరిగిందని, ఇందులో ఎలాంటి రాజకీయ గొడవకాదని, ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదులపై రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

చెన్నపట్నం చెరువు వద్ద పొంగళ్లు



చెన్నపట్నం చెరువు మొరవ వద్ద పూజలు

సోమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం చెన్నపట్నం చెరువు జలకళతో మొరవ పారడంతో ఆదివారం ఆయకట్టు రైతులు పూజలు చేశారు. చెరువుకట్టపై కొలువుదీరిన గంగమ్మ ఆలయంలో రైతులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అలాగే చెరువు మొరవ వద్ద, ఎగువ తూము వద్ద మహిళలు పూజలు చేశారు. ఇరికిపెంట, నడింపల్లె, దాదెంవారిపల్లె, ఎర్రమిట్ట, పార్వతీపురం, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, మాజీ నీటి సంఘ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గౌతం పర్యవేక్షించారు.

దసరా ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



దసరా ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పలమనేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని పాతపేట కనకదుర్గాదేవి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రకాష్, తిరుమలేష్, సురేష్, రత్నమ్మ, టీడీపీ నాయకులు నాగరాజు, కౌన్సిలర్ బీఆర్‌సీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ బజార్ ఆదాయం రూ. 24 లక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వి.బాలాజీ

పలమనేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని ది బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ 2024-25 ఏడాదిలో రూ.24.77 లక్షల ఆదాయాన్ని ఆర్జించిందని సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి.బాలాజీ తెలిపారు. ఆదివారం పలమనేరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 లో రూ.24.67 కోట్లకు సరుకు కొనుగోలు చేసి రూ. 26.34 కోట్ల అమ్మకాలు చేశామని తెలిపారు. అమ్మకాలు పోను స్టాకు రూ.92 వేలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం పాత ధరలకు కొనుగోలు చేసిన స్టాకు విక్రయాలు జరుగుతున్నాయని కొత్త స్టాకు కొనుగోలుకు జీఎస్‌టీ తగ్గుతుందని.. సూపర్ బజార్‌లో మరింత తక్కువ ధరలకు సరకులు విక్రయించేందుకు అవకాశాలున్నాయన్నారు. మొక్కుబడిగా సభ్యులు హాజరు కాగా పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి హెల్పింగ్ హ్యాండ్స్ అంత్యక్రియలు



అంత్యక్రియలకు తీసుకెళుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

పలమనేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పాతపేటకు చెందిన ఓ అభాగ్యుడు శనివారం రాత్రి చనిపోయాడు. అయితే భర్త అంత్యక్రియలు చేసేందుకు స్తోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొన్న స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ తదితరులు ఆదివారం అంబులెన్స్‌లో హిందూ శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు చేశారు. వారికి మృతుడి భార్య కృతజ్ఞతలు తెలియజేసింది.

ఎట్టకేలకు నిండిన కౌండిన్య రిజర్వాయర్



కాలువపల్లి వద్ద నిండిన కౌండిన్య రిజర్వాయర్

పలమనేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కాలువపల్లి సమీపంలోని కౌండిన్య రిజర్వాయర్ మూడేళ్ల తర్వాత ఎట్టకేలకు నిండింది. పలమనేరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు కాలువ పల్లి సమీపంలోని కౌండిన్య నదిపై రిజర్వాయర్ ను వైఎస్ హయాంలో మంజూరు చేశారు. ఈ రిజర్వాయర్ నిండితే దాదాపు రెండేళ్లపాటు పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు నీటి సరఫరా చేసేవారు. అయితే ఈ రిజర్వాయర్ వర్షాభావ పరిస్థితుల కారణంగా రెండేళ్ల క్రితమే ఒట్టిపోయింది. ప్రజలకు తాగునీటి సరఫరా మున్సిపల్ అధికారులకు గుదిబండగా మారింది. అయితే గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల్లోని చెరువులు కలుజుపారడంతో ఆ నీరంతా కౌండిన్యనదిలో చేరి ప్రవహిస్తోంది. ఇలా ప్రవహించిన నీరు కాలువపల్లి సమీపంలోని కౌండిన్య రిజర్వాయర్‌కు చేరుతూ వచ్చింది. ఆదివారం సాయంత్రానికి రిజర్వాయర్ నిండి పొంగిపొర్లుతోంది. దీంతో ప్రజలకు తాగునీటి సరఫరా సమస్య తీరనుందని అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఎస్‌డీపీఐ పట్టణ అధ్యక్షుడిగా జుబేర్



ఎస్‌డీపీఐ పట్టణ నూతన కార్యవర్గం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ ఎస్డీపీఐ అధ్యక్షుడిగా జుబేర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చంద్‌బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలో జరిగిన ఎస్డీపీఐ కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశామన్నారు. అధ్యక్షుడిగా జుబేర్, కార్యదర్శిగా మన్నన్, ఉపాధ్యక్షులుగా సద్దాం, సహాయ కార్యదర్శిగా ఎం.ఖాదర్‌ఖాన్, కోశాధికారిగా అబ్దుల్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.

తీర్థం చెరువులో పూజలు



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామ సమీపంలోని వెంకటపతయ్య చెరువు వద్ద ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతరెండురోజుల నుంచి తీర్థంచెరువు మొరవపోతుండటంతో గ్రామస్తులు ఊరేగింపుగా చెరువు వద్దకు వెళ్లి గంగమ్మకు పూజలు నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం చెరువువద్ద అన్నదానం చేశారు.

వి.కోట చెరువులకు హంద్రీ-నీవా జలాలు మళ్లించాలి



హంద్రీ-నీవా కాలువను సందర్శిస్తున్న రామచంద్రనాయుడు తదితరులు

రామకుప్పం, వి.కోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కుప్పం కెనాల్ నుంచి రామకుప్పం మండలం మీదుగా వి.కోట మండలానికి చెందిన చెరువులకు హంద్రీ-నీవా జలాలను మళ్లించాలని పలమనేరు ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు కోరారు. ఆదివారం వారు వి.కోట, రామకుప్పం మండలాలకు చెందిన 46 గ్రామాల రైతులు, ప్రజలతో కలిసి రామకుప్పం మండలం బైపరెడ్లపల్లె వద్ద హంద్రీ-నీవా కాలువను, కోట్లగూరు చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ వి.కోట మండలానికి హంద్రీ-నీవా జలాలు మళ్లింపుతో రామకుప్పం, వి.కోట మండలాల్లోని తూర్పుప్రాంతాలు సస్యశ్యామలమవుతాయని తెలిపారు. రెండు మండలాల్లో 22 చెరువులు నిండితే 46 గ్రామాలకు సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రామకుప్పం మండలం బైపరెడ్లపల్లె వద్ద గల హంద్రీ-నీవా కుప్పం కెనాల్ నుంచి ఉపకాలువ ఏర్పాటు చేస్తే రామకుప్పం మండలంలోని గురివిరెడ్డికుంట, నాగులకుంట, నాయనచెరువు, బొన్‌చెరువు, బోయనపల్లెకుంట, సాకలకుప్పం చెరువులకు జలాలు వస్తాయన్నారు. సాకలకుప్పం చెరువు మొరవ ప్రవహిస్తే గొలుసు కట్టు చెరువులైన రామకుప్పం మండలంలోని దేశినాయనపల్లె, మండోనికుంట, పంద్యాలమడుగు, బల్దారు, కవ్వంపల్లె చెరువులు నిండి వి.కోట మండలం రాగానముద్రం చెరువు, యనమలచెరువు, గంగేపల్లె, పెసులదొడ్డి, ఎస్.బండపల్లె, కొత్తకోట, ఆకులదొడ్డి, చింతమాకులపల్లె, భీమునికుంట, నాయకనేరి చెరువులకు జలాలు వస్తాయన్నారు. అంతేకాకుండా రామకుప్పం మండలంలోని అటవీప్రాంత గ్రామాల చేరువలోని అన్ని చెరువులకు నీరందుతుందని వారు తెలిపారు. విషయాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని.. బైపరెడ్లపల్లె నుంచి గురివిరెడ్డి కుంట వరకు హంద్రీ-నీవా ఉప కాలువ ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి సతీష్, సర్పంచులు విష్ణు, జయన్న, విశ్వనాథ్, పలుగ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సోమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి వైద్యశాల నిపుణులు కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించి కంటి వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే రుయా వైద్యశాల వైద్య నిపుణులచే పలువురికి రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. 45 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ కేవీ చలపతి, కోరా విజయ సహకారంతో జరిగిన క్యాంపులో వైద్యనిపుణులు డాక్టర్ భారతి, రోజా రమణి, రాజ్యలక్ష్మి, స్వప్న ప్రియ, రూపశ్రీ, చైతన్య పాల్గొనగా హెచ్‌ఎం. వాసు, ఉపాధ్యాయులు హైదర్, కృష్ణారెడ్డి వారిని సన్మానించారు.

గన్నావారిపల్లెలో టీడీపీ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

సోమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ గన్నావారిపల్లెకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు గన్నా ఆనంద్ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర ఐడీసీ మాజీ డైరెక్టర్ వై. సాంబయ్య, సింగల్ విండో చైర్మన్ శివశంకర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున, చాణుక్య, శెట్టివారి అశోక్, మహేంద్రబాబు తదితరు సందర్శించి నివాళులర్పించారు. ఆనంద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేటి నుంచి సల్లాపురెమ్మ ఉత్సవాలు



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డూరు గ్రామంలో దాదాపు 300 సంవత్సరాల క్రితం నిర్మించిన సల్లాపురెమ్మ ఆలయ దసరా ఉత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుడ్డారెడ్డి, నారాయణప్ప, దేవేంద్రరెడ్డి, విజయమ్మ, మునికృష్ణప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ అమ్మవారికి విశేషాలంకరణతో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఆధ్యాత్మిక భజనలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో ...

రొంపిచెర్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మొదటి రోజు బాల త్రిపురసుందరిగా, రెండోరోజు గాయత్రి దేవిగా, మూడో రోజు లలితాదేవిగా, నాలుగోరోజు అన్నపూర్ణాదేవిగా, ఐదోరోజు మహాలక్ష్మీగా, ఆరోరోజు సరస్వతిదేవి, ఏడోరోజు దుర్గాదేవి, ఎనిమిదోరోజు మహిషాసుర వగాగా, తొమ్మిదో రోజు రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి శరన్నవరాత్రి పూజలు

రామకుప్పం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని అమ్మవారి ఆలయాల్లో సోమవారం నుంచి శరన్నవరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మండల పరిధి కంబాలదేవుల పల్లెలోని సప్తమాతృకా చౌడేశ్వరీ ఆలయంలో 22నుంచి 29వ తేదీ వరకు వివిధ కుంకుమ అష్టోత్తర శతనామావళి పూజలు, 30న దుర్గాష్టమిని పురస్కరించుకొని పసుపు అలంకారం, అక్టోబరు 1న మహర్నవమి పూజలు, 2న విజయదశమి పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 2న రాత్రి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం, ఆనిగానూరులో కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో నవరాత్రి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు.

కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో..

పుంగనూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం నుంచి టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా శ్రీవారి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం ఆలయంలో అష్టలక్ష్మి అమ్మవార్లకు అభిషేకాలు, సాయంత్రం రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

మురుగునీటి కాలువ పనుల పరిశీలన



చౌడేపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె బస్టాండులో నిర్మిస్తున్న మురుగు నీటి కాలువల నిర్మాణాన్ని ఆదివారం టీడీ పీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వంలో బస్ షెల్టర్ వద్ద ఉన్న టీడీపీ జండాను వైసీపీ నాయకులు తొలగించి తనపై కేసులు పెట్టారన్నారు. అయితే ఇప్పుడు కాలువ నిర్మాణానికి బస్టాండులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం అడ్డుగా ఉన్నా.. తాము ప్రత్యామ్నాయంగా కాలువను పక్కకు మార్చినట్లు తెలిపారు. సింగిల్ విండో డైరెక్టర్ మునివెంకటరమణ, పృథ్వీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుండానే కాలువల నిర్మాణం



ఆర్ అండ్ బీ మార్కింగ్ ఉన్న ఇళ్లు

చౌడేపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండులో ఆక్రమణలు తొలగించకుండానే మురుగునీటి కాలువల నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు విస్తరణ కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్న సమయంలో మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టడంతో భవిష్యత్తులో కాలువ నిర్మాణం వృథా కానుండటం గమనార్హం. ఆక్రమణలు పెరగడంతో రోడ్డు ఇరుకుగా మారి తరచూ ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గతంతో పాలుమార్లు రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉమ్మడి సర్వేలు నిర్వహించి ఆక్రమణల తొలగింపు కోసం హద్దులు మార్కింగ్ ఇచ్చారు. అయితే ఆక్రమణలు తొలగింపు లేకపోగా.. జూనియర్ కాలేజీలో మూడు రోజుల క్రితం వర్షపు నీరు చేరడంతో బస్టాండు నుంచి పోలీస్ స్టేషన్ వరకు మురుగునీటి కాలువ నిర్మించేందుకు గత రెండు రోజుల నుంచి పనులు ప్రారంభించారు. అయితే రోడ్డు విస్తరణ జరిగితే కాలువ నిర్మాణ నిధులు వృథా కానున్నాయి. బస్టాండులో నిరుపయోగంగా, ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందిగా ఉన్న 6 చింత చెట్లు తొలగిస్తే రోడ్డు వెడల్పుతో పాటు ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులు ఉమ్మడిగా రోడ్డు విస్తరణ కోసం సర్వే నిర్వహించి.. ఆ తర్వాత మురుగునీటి కాలువ నిర్మాణం చేపడితే నిధులు సద్వినియోగంతోపాటు ట్రాఫిక్ సమస్య తీరనుంది.

నేటి నుంచి కన్యకా పరమేశ్వరికి అలంకరణలు

కల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు బజారువీధిలో కొలువైన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దసరా ఉత్సవ కమిటీ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వీధికుక్కల దాడితో లేగదూడలకు గాయాలు

సోమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం శీలయ్యగారిపల్లెలో ఆదివారం సిద్దులయ్యకు చెందిన రెండు లేగదూడలు పొలం వద్ద ఉండగా వీధికుక్కల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాధితుడు తెలిపారు. అలాగే సోమల శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ కందూరు రోడ్డులో ద్విచక్రవాహనానికి కుక్కలు అడ్డుగా రావడంతో వాహనం బోల్తా పడింది. గాయపడ్డ ఖాదర్‌బాషాకు సోమల ప్రైవేటు వైద్యశాలలో స్థానికులు చికిత్సలు కల్పించారు. సోమలలో వీధికుక్కలు వరుస దాడులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని.. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులపై హర్షం

గంగవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఒకేరోజు తెలుగులో 11 జీవోలను విడుదల చేయడం హర్షించదగ్గ విషయమని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రాష్ట్ర సచివాలయం వరకు తెలుగు భాషలో జీవోలు, ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తెలుగుభాషా రక్షణకు మార్గాలు అన్వేషించి తెలుగు అధికార భాషా సంఘాన్ని నియమించాలని డిమాండు చేశారు. తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించి తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించినప్పుడే తెలుగు భాష మనుగడ సాధించగలుతుందని తెలిపారు.

దుకాణంలో చోరీ

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె నుంచి లక్కనపల్లె వెళ్లే రహదారిలోని ఓ దుకాణంలో మూడురోజుల క్రితం చోరీ జరిగినట్లు బాధితురాలు భానుమతి చ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దుకాణంలో దాదాపు రూ.3.5 లక్షల విలువైన వెండి, రాగి, ఇత్తడి వస్తువులు చోరీ కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

సోమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు సమీపంలోని తోటలో కోడిపందెం స్థావరం పై పోలీసులు దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివశంకర తెలిపారు. వీరితో పాటు రెండు కోళ్లు, రూ.2600 నగదును స్వాధీనం చేసుకున్నారు.

మృతుడి కుటుంబానికి పెద్దిరెడ్డి పరామర్శ

సదుం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన దేవేంద్ర రెడ్డి(75) బుధవారం గుండెపోటుతో మరణించాడు. మృతుని కుటుంబాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం రెడ్డివారిపల్లెలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దసరా ఉత్సవాలను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ధర్మకర్త, కమిటీ సభ్యులు

వి.కోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):వి.కోట పట్టణంలో వెలసిన దుర్గమ్మ ఆలయంలో 22న సోమవారం నుంచి జరగనున్న దసరా ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త ఎస్.ఆర్.దామోదర్‌రెడ్డి కోరారు. పదిరోజుల పాటు అమ్మవారికి నిత్యం ఉదయం అభిషేకాలు, అలంకరణ ఉంటాయన్నారు. 30న మంగళవారం దుర్గాష్టమిని పురస్కరించుకుని 3,555 పాల కలశాలతో మహిళలు తరలివచ్చి అమ్మవారికి పాలాభిషేకం నిర్వహిస్తారని తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

దివ్యాంగులకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న చుడా ఛైర్‌పర్సన్ హేమలత

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 21(ఆంధ్ర జ్యోతి): దివ్యాంగులకు సేవలు అందించడం పూర్వజన్మ సుకృతమని చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత అన్నారు. విద్యాశాఖ-సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ పరిధిలోని సహిత దివ్యాంగులకు మెడికల్ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుడా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సదుపాయాలు సదినియోగం చేసుకోవాలన్నారు. ఏపీసీ వెంకటరమణ మాట్లాడుతూ ఇప్పటి వరకు నాలుగు నియోజకవర్గాల్లో క్యాంపులు నిర్వహించామన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఎంఈవో-2 మోహన్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాలశీతలీకరణ కేంద్రం



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కటికపల్లె పంచాయతీ పిళ్లిగుండ్లపల్లె గ్రామ సమీపంలో పాల శీతలీకరణం కేంద్ర భవనం నిరుపయోగం మిగిలిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం దీనిని ఎవరికీ ఉపయోగపడని చోట లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించింది. పనులు పూర్తయ్యే దశలో ఆపేశారు. ప్రస్తుతం భవనం ఖాళీగా ఉండటంతో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయంలో ఇదేనా స్వచ్ఛాంధ్ర?


ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు- వాటి మధ్య దాగిన చెత్తబండి

వెదురుకుప్పం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పరిశుభ్రతకు ప్రాధాన్యత నిస్తూ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే ఇక్కడ ఎంపీడీవో కార్యాలయం వద్ద కనీసం ఆ జాడ కనిపించడంలేదు. పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా తాండవిస్తోంది. పక్కనే వెలుగు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక కార్యాలయాలున్నాయి. ఇక్కడ కూడా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. చెత్తను తొలగించాల్సి బండి సైతం ఈ పిచ్చి మొక్కల మధ్య వ్యర్థంగా దర్శనమిస్తోంది. ఈ వాతావరణం ఫలితంగా విషపురుగుల బెడద ఎక్కువగా ఉందని ఇక్కడి వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉద్యోగులయినా వీటిని తొలగించడం లేదు. ఇప్పటికైనా పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న వేమేశ్వరి, చిత్రంలో అంగన్‌వాడీ వర్కర్లు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్ల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని ఫోరం ఫర్ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్ల హక్కుల కోసమే ఫోరం ఫర్‌అంగన్‌వాడీ యూనియన్‌ను ప్రారంభించామన్నారు. అనంతరం జిల్లా స్థాయి అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. సరస్వతి, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సూపర్ బజార్ ఆదాయం రూ. 24 లక్షలు

పలమనేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ 2024-25లో రూ.24.77 లక్షల ఆదాయాన్ని ఆర్జించిందని సూపర్ బజార్ అధ్యక్షుడు ఆర్.వి.బాలాజీ తెలిపారు. ఆదివారం పలమనేరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.24.67 కోట్లకు సరుకు కొనుగోలు చేసి రూ.26.34 కోట్ల అమ్మకాలు చేశామన్నారు. ప్రస్తుతం పాత ధరలకు కొనుగోలు చేసిన స్టాకు విక్రయాలు జరుగుతున్నాయని కొత్త స్టాకు కొనుగోలుకు జీఎస్‌టీ తగ్గుతుందన్నారు.

నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.

బంగారుపాళ్యం ఏఎంసీ మాజీ డైరెక్టర్ మృతి


కొల్లారమేష్(ఫైల్ ఫొటో)

ఐరాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, మండల టీడీపీ నాయకుడు కొల్లారమేష్(67) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుగూ కన్నుమూశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే మురళిమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు గంగారపుహరిబాబునాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు గిరిధర్ బాబు సంతాపం ప్రకటించారు. సోమవారం పి.కట్ట కిందపల్లెలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేటినుంచి మూడు రోజుల పాటు విద్యుత్ అంతరాయం

బంగారుపాళ్యం,సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): మండల పరిసర ప్రాంతాల్లో సోమవారం నుంచి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దేవీప్రసన్న ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ నూనెగుండ్లపల్లె 132 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా మూడు రోజుల పాటు ఇబ్బంది ఎదురవుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తులకు అన్నదానం



బంగారుపాళ్యం,సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): మండల కరణం సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మొగిలీశ్వరుడి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. మహాలయ అమావాస్య సందర్భంగా పితృదేవతలకు శాంతి చేకూరలనే ఉద్దేశంతో సంఘం ఈమేరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం ప్రతినిధులు నిర్వాహకులు తెలిపారు. అంతకు ముందు కామాక్షి సమేత మొగిలీశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ంలో మండల కరణం సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి రవీంద్రప్రసాద్, ఉపకార్యదర్శి శంకరన్,సభ్యులు హరిహరప్రసాద్,రవిచంద్ర,లక్ష్మీనాథ్,రుగ్మాంగధ,సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్ల స్వాధీనం

బంగారుపాళ్యం,సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి):అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం .. బలిజపల్లె సమీపంలోని ఓ దాబా నిర్వాహకుడు దీనా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఆదివారం దాడులు నిర్వహించి 20 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బురదమయంగా గ్రామీణ రోడ్లు


తెల్లగుంట రహదారిలో వెళ్లాలంటే ఇబ్బందే

విజయపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి వర్షపునీర్లు నిలవడంతో దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మాధవరం, తెల్లగుంట, వరదరాజులు కండ్రిగ, కేవీశ్రీరామాపురంలో సిమెంటు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 21(ఆంధ్ర జ్యోతి): కారు-బైక్ ఢీకొన్న సంఘటనలో స్కూటరిస్టు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం కార్వేటినగరం -పుత్తూరు జాతీయ రహదారిలో లక్ష్మీనరసింహ విద్యాసంస్థ సమీపంలో ఎదురెదురుగా కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. అతడ్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆలయంలో అన్నదానం

వెదురుకుప్పం, సెప్టెంబరు 21(ఆంధ్ర జ్యోతి): కార్వేటినగరం రుక్మిణీ,సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం తిరుపతికి చెందిన రేవతి కుటుంబీకుల అన్నదానం చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ ఈ విషయం తెలిపారు.

అన్నదాత గుండె 'చెరువు'

- కాలువ గండ్లు, ఆక్రమణలతో చేరని నీరు


యాదమరిలో త్రివేణి సంగమం వద్ద వృథాగా పోతున్న నీవా జలాలు

యాదమరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు నీవానదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తున్నా చెరువులకు చేరలేదు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడం, కొంతమేర ఆక్రమణలకు గురికావడంతో ఈ పరిస్థితి దాపురించింది. వృథాగా పోతున్న నీటిని చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కారణంగా నుంజర్ల ప్రాజెక్టు నుంచి నీరు పొంగిపొర్లుతోంది. ఈ నీరు కేవలం రెండు చెరువులకు మాత్రమే చేరి, మిగిలింది నీవానదిలో కలిసి వృథాగా పోతోంది. దళవాయిపల్లి నాయనిచెరువు, కుక్కలపల్లి బోధన్‌చెరువులతో పాటు మిగిలిన వాటికీ నీరు చేరడం లేదు. నుంజర్ల ప్రాజెక్టు నుంచి 3 కి.మీ. దూరంలోని నాయనిచెరువు కాలువలకు గండ్లు పడ్డాయి. నీవానది నుంచి వచ్చే బోధన్‌చెరువు, కోణాపల్లిచెరువు ప్రధాన కాలువను అనేకచోట్ల రైతులు, స్థానికులు పూడ్చివేశారు. అదేవిధంగా


నీరులేక వెలవెలబోతున్న కుక్కలపల్లి బోధన్ చెరువు

ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణ పనుల కారణంగా కూడా కొన్ని కాలువలు దెబ్బతిన్నాయి.కాలువలను పునరుద్ధరించి, చెరువులను నింపితే భూగర్భజలాలు పెరుగుతాయని కుక్కలపల్లి బోధన్ చెరువు అధ్యక్షుడు ఎం.గిరి పేర్కొన్నారు. జలవనరులశాఖ, రెవెన్యూశాఖ అధికారులు వెంటనే చొరవ తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

ఉపాధి నిధులతో జోరుగా రోడ్ల నిర్మాణ పనులు

పాలసముద్రం, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): జాతీయ ఉపాధి హామీ కింద మండలానికి రూ.7.30 కోట్లతో 63 పనులు మంజూరయ్యాయని ఎంపీపీ శ్యామల తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్యామలు మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. నాడు-నేడు రెండో విడత మంజూరైన పనుల్లో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వీటి నిర్మాణం పూర్తికావడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. క్రిష్ణజిమ్మాపురంలో జిల్లాపరిషత్ ద్వారా మంజూరైన రూ.5 లక్షలతో తాగునీటి బోరు వేసి, మోటరు అమర్చి పైప్‌లైన్ వేయించాలని జడ్పీటీసీ అన్బు కోరారు. జలజీవన్ మిషన్‌లో అసంపూర్తిగా వున్న పనులను పూర్తిచేయాలని గంగమాంబాపురం సర్పంచ్ హరిరాజు కోరారు. పీఎంజీవో పథకం ద్వారా వెంగళరాజుకుప్పం, పాలసముద్రం కాలనీల్లో సోలార్ వీధిదీపాలు వేయిస్తామని పంచాయతీ


మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

రాజ్ ఏఈ జయరాజ్ తెలిపారు. తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో సతీష్, అరుళ్‌నాథన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా డీకే జయంతి వేడుకలు


జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బలిజ సేవా సంఘం నాయకులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు చోట్ల దివంగత టీటీడీ ఛైర్మన్ ఆదికేశవులునాయుడు, ఆయన సతీమణి సత్యప్రభ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మురకంబట్టు వద్ద ఉన్న డీకే ఆదికేశవునాయుడు విగ్రహం వద్ద, బలిజ సేవా సంఘం వద్ద, శాంతారామురామన్ కళ్యాణ మండపం వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మూడు చోట్ల అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో డీకే బద్రినాథ్, ఓఎం రామదాస్, నరసింహులు, కిరణ్ రాయల్, తిరుకుమరన్, ఈశ్వర్ తదితరులు పాల్గొనారు. సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు డీకే దంపతుల చిత్రపటాలకు నివాళులు అర్పించి కేక్ కట్ చేశారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలి


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న అయిరాల రాజేష్‌రెడ్డి

ఐరాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని ఆత్మా మాజీ ఛైర్మన్ అయిరాలరాజేష్‌రెడ్డి ఎమ్మెల్యే మురళిమోహన్‌కు విన్నవించారు. చిత్తూరులో ఆయన్ను కలసి పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిని సీహెచ్‌సీగా మారిస్తే ఆరు పడక ఆసుపత్రి పడకల ఆసుపత్రిగా మారుతుందన్నారు. రోజూ ఈ ఆసుపత్రికి 200 మంది తగ్గకుండా రోగులు వస్తున్నారన్నారు. సీహెచ్‌సీగా మారిస్తే ముగ్గురు డాక్టర్లు అవసరమవుతారన్నారు. ఆసుపత్రిలోనే శవ పంచనామా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ నరిగన్నగారిసుధాకర్, దిలీప్‌రెడ్డి, అయిరాల రంజిత్‌రెడిల వాసుదేవరెడ్డి, లోకనాథరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి లక్ష్మీనారాయణస్వామి నవరాత్రి వేడుకలు



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 21: వేపంజేరిలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి అక్టోబరు 2 వరకు వార్షిక నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయట్రస్టీ కేఎస్ వాసు, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డిలు ఈమేరకు తెలిపారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ 27వతేది సాయంత్రం అంకురార్పణం జరుగుతుందన్నారు. 28న ధ్వజారోహణం, శేషావాహనం, సింహవాహనం, 29న మోహినీ ఉత్సవం, కల్యాణోత్సవం, రాత్రి గరుడవాహనం, 30న హనుమంత వాహనం, గజవాహనం, అక్టోబరు నెల 1న రథోత్సవం, అశ్వవాహనం 2న గురువారం చక్రస్నానం కార్యక్రమంలో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఆలయంలో రోజూ ఉదయం,రాత్రి భక్తులకు అన్నదానం చేస్తామని వివరించారు.

చేప పిల్లల కేంద్రం పరిశీలన


చనిపోయిన చేప పిల్లలను పరిశీలిస్తున్న రవికుమార్

వెదురుకుప్పం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయంలో చేప పిల్లప పెంపకాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి రవికుమార్ ఆదివారం తనిఖీ చేశారు. చేప పిల్లల పెంపక కేంద్రం పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించి, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ రాజేష్, మత్స్యశాఖ అధికారి రామ్మోహన్, ఉద్యోగులు ఉన్నారు. చేప పిల్లల పెంపెకం కేంద్రంలో వర్షాల తాకిడికి పది లక్షల చేప పిలల నష్టం జరిగిందని రామ్మోహన్ తెలిపారు. వర్షం నీటి వల్ల కొన్ని కొట్టుకుపోగా అధిక వర్ష తీవ్రత వల్ల మృత్యువాత పడ్డాయన్నారు. వర్షాలు వచ్చిన సందర్భాల్లో చేప పిల్లలకు నష్టం జరుగుతుందన్నారు.

నేటి నుంచి దేవి నవరాత్రి వేడుకలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో సోమవారం నుంచి దేవి నవరాత్రి, కార్తీకమాస పూజలు నిర్వహించనున్నారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం మహాలక్ష్మి అలంకారం, 23న పసుపు, 24న కుంకుమ, 25న అన్నపూర్ణేశ్వరి, 26న చందనం,27న శాఖాంబరి, 28న గాజుల, 29న పసుపు అలంకారం, 30న బియ్యం పిండి, అక్టోబరు 1న విజయక్ష్మి అలంకారాల్లో అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ నిర్వాహకులు డి. క్రిష్ణమూర్తి తెలియజేశారు. కార్తీక మాస పూజలు సందర్భంగా ప్రతి సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం


దీపిక


హేమశ్రీ

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. బండ్లదొడ్డి గ్రామానికి చెందిన సురేష్ కుమార్తె దీపిక(19)కు ఇటీవల వివాహం చేశారు. ఈ నేపథ్యంలో దీపిక శనివారం నుంచి కనబడకపోవడంతో ఆమె భర్త రజనీకుమార్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ●మొగిలివెంకటగిరి దళితవాడకు చెందిన హేమశ్రీ(17) ఆదివారం ఉదయం నుంచి కనబడకపోవడంతో తల్లిదండ్రులు ఆదివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై మల్లప్ప తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మహాలయ అమావాస్య

- పితృ దేవతలకు తర్పణాలు


నీవానది వద్ద పితృ దేవతలకు తర్పణాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): నగరవాసులు ఆదివారం మహాలయ అమావాస్య పూజలు, తర్పణాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నీవానది సమీపంలోని రాజుగుడి, అగస్త్యేశ్వరాలయం, ఎన్టీఆర్ జలాశయం, గిరింపేట సుగుణేంద్ర తీర్థ మూల సన్నిధానం, శంకర బ్రాహ్మణ సేవా సంఘం, బజారు వీధి రాఘవేంద్ర స్వామి ఆలయం, దుర్గానగర్ కాలని చెరువు, కట్టమంచి చెరువు, గంగనేని చెరువ, చిత్తూరు రిజర్వ్ ఫారెస్ట్ తదితర ప్రాంతాల్లో పలువురు తమ పితృదేవతలకు తర్పాణాలు సమర్పించారు. అమావాస్య సందర్భంగాఅన్నీ ప్రాంతాల్లో వాణిజ్య రంగాల వారు, గృహస్థులు లోగిళ్ళ ముందు బూడిద గుమ్మడి కాయలు కొట్టారు.

విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచాలి



మాట్లాడుతున్న కోదండయ్య

వెదురుకుప్పం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థులమెస్ బిల్లులు పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వంట కార్మికుల జీతాలను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కార్వేటినగరంలో మధ్యాహ్న భోజన కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షురాలు జయకుమారి, మండల నాయకులు రమేష్, రేష్మ, భారతి, యశోద, మహేశ్వరి, విజయశాంతి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాభివృద్ధికి కృషి


కిషన్‌చంద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పాతగుంట సమీపంలోని వేపరికొండపై వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ తెలిపారు. ఆదివారం ఆయన్ను వెదురుకుప్పంలో కార్యనిర్వాహకులు కలిశారు. ఈ సందర్భంగా ఆలయానికి వెళ్లే మార్గాన్ని ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పరచడానికి సహకరించాలని, నిర్మాణ పనుల్లో భాగస్వాములు కావాలని కిషన్‌చంద్‌ను కోరారు. నిర్వాహకులు శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, షణ్ముగరెడ్డి, తిరుపాల్, భాస్కర్‌నాయుడు, సాంబశివారెడ్డి, గురుమూర్తి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.